జిఒ 4తో పారా క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులకు 3 శాతం ఉద్యోగాలు కేటాయించడం పట్ల పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఉడాకాలనీలోని సారథి వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పారా క్రీడాకారులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం రాష్ట్ర స్థాయి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం నిర్వాహకులు దయానంద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా వికలాంగుల కోసం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీకి జిఒ 4 జారీ చేయడం ద్వారా పారా క్రీడాకారుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం చాటుకుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకులు ప్రదీప్, అమ్మ సేవా సమితి అధ్యక్షులు లక్కీ శేఖర్, మూర్తి, వెంకటరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

- ఏడాది నుంచి ఇవ్వడం లేదంటూ ఆవేదన
- తెరుచుకోని వెబ్‌సైట్
- ఎప్పటికి ఇస్తారో తెలియని దుస్థితి

భోగాపురం మండల కేంద్రానికి చెందిన కొచ్చెర్ల నాగలక్ష్మి రెండేళ్ల క్రితమే (2023 జులై నెలలో) భర్తను కోల్పోయింది. నాటి నుంచి ఆమె వితంతువు పింఛను కోసం ఎదురు చూస్తోంది. 2024 జనవరి వరకు వైసిపి నాయకులు అదిగో ఇదిగో.. అంటూ నెట్టుకొచ్చారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ వల్ల జూన్‌లో ఎగ్గొట్టారు. ప్రభుత్వం మారిన తరువాత పింఛన్ల కోసం దరఖాస్తులను కూడా స్వీకరించలేదు. దీంతో నాగలక్ష్మి నేటికీ పింఛనుకు నోచుకోలేదు. దీంతో ఇద్దరి పిల్లలను చదువు మాన్పించి రోజువారీ కూలీలుగా పంపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

గంట్యాడ మండలం చంద్రంపేటకు చెందిన చలుమూరి అప్పారావుకు 60 ఏళ్ల వయసు దాటి ఆరుమాసాలు గడిచాయి. అంతకు ముందు నుంచే కనీసం ఉపాధి, వ్యవసాయ పనులకు కూడా వెళ్లలేని స్థితి. సెంటు భూమి కూడా లేదు. వయసు ఆరు పదులు దాటితే పింఛనైనా రాకపోతుందా? అని ఎదురు చూడాల్సిన దుస్థితి ఆయనది. దరఖాస్తుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతపర్చి ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్వీకరించడం లేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇది కేవలం నాగలక్ష్మి, అప్పారావు సమస్య మాత్రమే కాదు.., జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, డప్పు కళాకారులు, చేనేత, కల్లుగీత కార్మికులతోపాటు వివిధ కేటగిరీల్లో పింఛనుకు అర్హులైన వేలాది మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో సుమారు 15 కేటగిరీల్లో 2,73,083 మందికి ప్రభుత్వ పింఛన్లు అందుతున్నాయి. వీరిలో అత్యధికంగా కిడ్నీ తదితర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు చొప్పున, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు, సైనిక వెల్ఫేర్ కేటగిరీలో రూ.5 వేలు, అభయ హస్తం కేటగిరీలో రూ.500 చొప్పున, మిగిలిన కేటగిరీ పింఛన్లకు రూ.4 వేలు చొప్పున అందుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాలోని పింఛనుదారులందరికీ కలిపి నెలకు రూ.115.08 కోట్ల మేర అందుతోంది. ఇందుకు తగ్గట్టే అర్హత పొందిన ప్రతిఒక్కరూ పింఛన్ల ద్వారా కుటుంబాన్నీ నెట్టుకురావచ్చని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ, సుమారు ఏడాదికిపైగా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ప్రతి ఆరు నెలలకూ పింఛన్లు మంజూరు

గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రతి ఆరు నెలలకోసారి (జనవరి - జూన్ నెలల్లో) పింఛన్లు మంజూరయ్యేవి. గత ఏడాది జనవరి వరకు ఈ పద్ధతి పాటించినప్పటికీ జూన్ నెలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పింఛన్లు మంజూరు చేయలేదు. ఆ తరువాత టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరినప్పటికీ జనవరిలో పింఛన్ల మంజూరుకు ముందుకు రాలేదు. దీంతో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారిలో ఆందోళన మొదలైంది. మరికొందరిలో ప్రభుత్వం తీరుపైనా ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. పింఛన్ల దరఖాస్తులకు వెబ్‌సైట్ కూడా తెరుచుకోవడం లేదని, నాట్ ఓపెన్ అని వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పింఛన్లు ఎప్పటికి మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి ఉండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్నా..

ఓవైపు వృద్ధాప్యం. దీనికితోడు అనారోగ్యం. ఇన్నాళ్లూ ఎలాగోలా గడిపేసినా ఇక కడుపు ఎలా నింపుకోవాలి? వైద్యం ఎలా చేయించుకోవాలో తెలియని పరిస్థితి. పింఛను వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ కడగండ్లే మిగిలాయి. పోనీ, ఎప్పటికి వస్తుందో కూడా తెలియని పరిస్థితి. బతుకుపై బెంగగానే ఉంటోంది.

- చలుమూరి రామలింగ స్వామి, చంద్రంపేట, గంట్యాడ మండలం

బడ్జెట్ ప్లాన్ చేస్తున్నాం

పింఛన్ల కోసం ప్రత్యేకమైన బడ్జెట్ ప్లాన్ చేస్తున్నాం. ఆ కసరత్తు పూర్తికాగానే అర్హులైన వారందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తాం. ఎవరూ ఆందోళన, అధైర్య పడాల్సిన అవసరం లేదు. పింఛన్లు తొలగిస్తున్నామన్న వైసిపి నాయకుల మాటల్లో వాస్తవం లేదు. ప్రభుత్వం మారిన తరువాత వెరిఫికేషన్ చేసుకోవడం అనేది సర్వసాధారణం. డిసెంబర్ నుంచి మరణించిన పింఛనుదారుల స్థానంలో వారి భార్య పేరుతో వెంటనే పింఛన్లు మంజూరు చేస్తున్నాం.

- కొండపల్లి శ్రీనివాస్, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎంఎస్‌ఎంఇ మంత్రి

నిరీక్షణకు తెర

- డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాకు 446 పోస్టులు.. ఆశ్రమ పాఠశాలల్లో 137..
- పిఇటిలకు నిరాశ
- వేళల్లో అభ్యర్థులు.. వందల్లో పోస్టులు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పది నెలలుగా ఊరిస్తున్న ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు అన్ని సబ్జెక్టులకు కలిపి 446 పోస్టులు కేటాయించింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి మరో 137 పోస్టులున్నాయి. రాష్ట్రంలో 16,347 పోస్టులతో డిఎస్‌సి ప్రకటించగా, ఉమ్మడి విజయనగరం జిల్లాలో పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1 : 14, హిందీ : 14, ఇంగ్లీష్ : 23, బయోలాజికల్ సైన్స్ 20, గణితం : 8, ఫిజికల్ సైన్స్: 32, సోషల్ : 62, పీడీ : 63, ఎస్‌జిటి 219 పోస్టులున్నాయి. మొత్తం 446 పోస్టులు కేటాయించారు. వీటితోపాటు సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి ఇంగ్లీష్ : 7, గణితం : 25, ఫిజికల్ సైన్స్ : 24, బయోలాజికల్ సైన్స్ :16, సోషల్ : 5, ఎస్‌జిటి : 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 137 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఆదివారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. జూన్ ఆరో తేది నుంచి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

పిఇటి అభ్యర్థులకు నిరాశ

డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పిఇటి పోస్టుల కోసం ఎదురుచూసిన అభ్యర్థులకు నిరాశ మిగిలింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్యను అందించే పిఇటి ఖాళీలు ఒక్కటి కూడా నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పిఇటి శిక్షణ పొందిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

వేలల్లో అభ్యర్థులు

ఉత్తరాంధ్ర ఐఎఎస్‌గా పేరు గాంచిన ఉపాధ్యాయ పోస్టులకు వేల సంఖ్యలో అభ్యర్థులు బిఇడి, డైట్, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో డిఎస్‌సి కోసం 25 వేల నుంచి 30 వేల మంది ఎదురు చూస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం వయసు సడలింపు ఇవ్వడంతో మరో ఐదు వేల మంది పెరిగే అవకాశం ఉంది. తక్కువ పోస్టులు కావడంతో ఇతర జిల్లాలకు వెళ్లే అవకాశం ఉంది.

స్టాండింగ్ కమిటీ నిర్ణయాలు అమలయ్యేనా?

అధ్వానంగా తయారైన గోడలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో పునరుద్ధరణ (రెనోవేషన్) పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ రూ.40 లక్షలు కేటాయించింది. మార్చి 17న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపింది. నెల రోజులు దాటినా రెనోవేషన్ పనులు ప్రారంభం కాలేదు. ప్రధానంగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మొదటి అంతస్తు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో సర్వేయర్ రూమ్, టౌన్ ప్లానింగ్ రూమ్, సెక్రటేరియట్ రూమ్, 2 ఫ్లోర్ల కారిడార్లు, ఎలక్ట్రికల్ పవర్ రూమ్‌లను బాగా పాడైన కారణంగా రెనోవేషన్ చేయాలని మేయర్ ఆదేశించారు. అనంతరం కమిషనర్ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు కూడా జారీ చేశారు.

ప్రధానంగా గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌లో పెయింటింగ్ వేయాలి. టౌన్‌ప్లానింగ్ రూమ్‌లో టైల్స్, కేబిన్లు నిర్మించడం, సీలింగు, పెయింటింగ్ పనులు చేయాలి. సెక్రటేరియట్ సెక్షన్‌లో కొంత భాగం టైల్స్ వేయడంతోపాటు పెయింటింగ్ వేయాలి. సర్వేయర్ గదిలో కేబిన్ నిర్మించి మొత్తం హాల్ పెయింటింగ్ చేయాలి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో లిఫ్ట్ వద్ద పవర్ రూమ్‌కి ఎంఎస్ గ్రిల్ వేయాలి. ఫస్ట్‌ఫ్లోర్ మీటింగ్ హాల్‌కి పెయింటింగ్ వేయాలి. అన్ని విభాగాల్లో ఎలక్ట్రికల్ మరమ్మతులు చేయాలి. వీటితోపాటు ఇతరత్రా పనులకు రూ.40 లక్షలు కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కానీ ఇంతవరకు ఎటువంటి పనులూ ప్రారంభం కాలేదు.

నెల రోజులు దాటినా ప్రారంభం కాని పనులు

టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో అడుగుపెడితే ఎలుకల మూత్ర విసర్జన వాసన వస్తుంది. ప్రధానంగా ఆ శాఖ అధికారులకు రూముల్లోకి వెళ్తే ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. త్వరితగతిన రెనోవేషన్ చేపట్టి ఈ దుర్వాసన నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు. పాత భవనం కావడంతో మరమ్మతులకు గురైంది. ఈ పనులు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వెంటనే రెనోవేషన్ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పిచ్చుకగూడులా కరెంటు వైర్లు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

కార్పొరేషన్ కార్యాలయంలో రెనోవేషన్ పనుల కోసం స్టాండింగ్ కమిటి రూ.40 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. నగరంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రెనోవేషన్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

- పి.నల్లనయ్య, కమిషనర్

'మూడో బిడ్డ'కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భోగాపురం

ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న ఎమ్‌పి కలిశెట్టి, కలెక్టర్ అంబేద్కర్

మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మార్చి 8వ తేది తరువాత మూడో బిడ్డగా ఆడపిల్ల జన్మిస్తే రూ.50 వేలు ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్‌పి ప్రకటించారు. అందులో భాగంగా భోగాపురం మండలం సవరవల్లిలో ఓ మహిళ ఆడపిల్లకు జన్మనివ్వడంతో ఆదివారం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రూ.50 వేలు చెక్కును కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ద్వారా అందజేశారు. జిల్లాలో తాను ఏర్పాటుచేసిన నిఖిల ట్రస్టు ద్వారా మూడో బిడ్డగా ఆడపిల్లకు జన్మనిచ్చిన కుటుంబాలకు ఇకపై రూ.50 వేలు చొప్పున అందిస్తానని ఎమ్‌పి ప్రకటించారు. వైద్యారోగ్య శాఖ అందించే జాబితా ఆధారంగా ప్రతి మూడు నెలలకు ఈ సహాయం అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిఎంహెచ్ఒ జీవనరాణి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ కోచ్‌కి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న అథ్లెటిక్స్ కోచ్ టి.అప్పారావుకు మదర్ తెరిసా సేవా సంఘం ఆర్థిక సాయం అందజేసింది. డెంకాడ మండలం పెదతాడివాడలోని ఆయన నివాసానికి మదర్ తెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం వెళ్లి అప్పారావు తల్లికి రూ.18,500 అందజేశారు.

మహిళ మృతదేహాన్ని తరలిస్తున్న వివైఎఫ్ సభ్యులు

మేమున్నామంటూ..

ఆపత్కాలంలో అండగా నిలిచిన విజయనగరం యూత్ ఫౌండేషన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కష్టకాలంలో మేమున్నామంటూ విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు మరోసారి ముందుకొచ్చారు. అనారోగ్యం బారిన పడి మృతి చెందిన మహిళను స్వస్థలానికి తరలించేందుకు దాతల సహకారంతో ఆదివారం అంబులెన్స్ ఏర్పాటు చేసి, మంచిమనసు చాటుకున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం కొనికి గ్రామానికి చెందిన షేక్ కరీమున్ మతిస్థిమితం లేక జామి చేరుకున్నారు. ఆమెను అక్కడ విలేకరి రమణ, జామి పోలీసులు కలిసి విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. సుమారు 21 రోజులు చికిత్స పొందిన ఆమె పరిస్థితి విషమించి మరణించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి కూడా వారి దగ్గర డబ్బులు లేని సమయంలో జామి కానిస్టేబుల్ కుమార్.. విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్. ఇల్తమాష్‌కు, కానిస్టేబుల్ షఫీకు సమాచారం అందించారు.

వారు ముస్లిం పెద్దలను సంప్రదించారు. షేక్ ముజ్జు, రాఖీబ్, నయీమ్, రెహమాన్, ఎటికె అధ్యక్షులు ఖలీల్ బాబు, ఇర్ఫాన్, మెహబూబ్ షరీఫ్ ఏర్పాటుచేసిన ఫ్రీజర్ అంబులెన్స్‌లో వారి స్వస్థలానికి మృతదేహాన్ని తరలించారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు రాయల్ క్యాబ్స్ శరత్, అశోక్, సాయి, రాము, రఘు, పి.రఘు, విజయ్ కాంత్, వర్మ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా

- వేసవి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- సోలార్ పవర్‌తో కరెంటు, ఖర్చు ఆదా
- 'ప్రజాశక్తి'తో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా అందించేలా చర్యలు చేపట్టామని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. ఎవరికైనా విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు కలిగితే వెంటనే 1912 నంబర్‌కి ఫోన్ చేయాలని చెప్పారు. వెంటనే తమ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారని వెల్లడించారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఎస్ఇ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వేసవి నేపథ్యంలో విద్యుత్తు సరఫరా, ప్రజలకు అందించే కరెంటు సేవల గురించి అందులో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

వేసవి ప్రారంభం కావడంతో విద్యుత్తు వినియోగం ఏ విధంగా ఉంది.?

వేసవి ప్రారంభం కావడంతో గతేడాదితో పోలిస్తే విద్యుత్తు వినియోగం కేవలం 50 నుంచి 60 మెగా వాట్ల వినియోగం పెరిగింది. సాధారణ రోజుల్లో 400 నుంచి 410 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉంటే, అది కాస్తా నేడు 460 నుంచి 480 మెగావాట్ల వరకు పెరిగింది. గత ఏడాది ఇదే నెలలో 500 పైగా మెగావాట్ల వినియోగం ఉండేది. గత ఏడాది కంటే మెరుగ్గా విద్యుత్తు సరఫరా అవుతోంది. రోజు వారి వినియోగం కూడా 9.8 మెగా వాట్ల నుంచి 10కి చేరింది. సాధారణ వినియోగం కంటే 5 నుంచి 6 శాతం వరకు వినియోగం పెరిగింది. మే నెలలో కూడా ఇదే విదంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

వేసవి వస్తే చాలు విద్యుత్తు కోతలు అధికంగా ఉంటాయి. వాటిని నివారించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు.?

వేసవి నేపథ్యంలో విద్యుత్తు అంతరాయం, కోతలు తగ్గించేలా చర్యలు తీసుకున్నాం. గత ఏడాదితో పోల్చి చూస్తే 20 శాతంగా ఉన్న అంతరాయం 7 శాతానికి తగ్గింది.

లోఓల్టేజ్ సమస్య ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారు.?

లోఓల్టేజ్ సమస్యను అధిగమించాం. గత ఏడాదిలో ఓల్టేజ్ సమస్య, పవర్ లోడింగ్‌ను తగ్గించడం కోసం సుమారుగా 120 వరకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లాలో ఏర్పాటు చేశాం. దీని వల్ల ఈ సమస్యను అధిగమించాం. ఎక్కడైనా లోఓల్టేజ్ సమస్య ఉంటే ఆయా ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలి. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.



విద్యుత్తు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

విద్యుత్తు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి నెల రెండో తేదిన విద్యుత్తు భద్రత దినంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఉద్యోగుకు, ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రమాదాలు జరగకుండా ఎలా నివారించాలి? అనే విషయాన్ని అవగాహన కల్పిస్తున్నాం.

వేసవి నేపథ్యంలో గాలులు, వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి.?

వేసవిలో విద్యుత్తు వినియోగం పెరగడం ఒకటైతే, ప్రకృతి వైపరీత్యాలు, గాలులు అధికంగా వీచే అవకాశం ఉంటుంది. దానిని ఎదుర్కొనేందుకు శాఖా పరంగా సిద్ధంగా ఉన్నాం. అందుకోసం 900 విద్యుత్తు స్తంభాలు, 337 ట్రాన్స్‌ఫార్మర్లు, సరిపడా వైర్లు అందుబాటులో ఉంచాం.

విద్యుత్తు వినియోగంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

వేసవిలో విద్యుత్తు వినియోగం పట్ల ప్రజలు జాగురుకతతో ఉండాలి. అధిక విద్యుత్తు కాల్చే లైట్లు, మోటార్లు, ఎసిల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎసిల వినియోగం ఎక్కువగా ఉంటుంది. 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచి ఎసి వినియోగం చేయడం వల్ల విద్యుత్తు పొదుపు, డబ్బులు కూడా ఆదా అవుతాయి. అనవసరంగా విద్యుత్తు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పిఎం సూర్యఘర్ పథకానికి ప్రజల స్పందన ఎలా ఉంది.?

పిఎం సూర్యఘర్ పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు 1051 దరఖాస్తులు వచ్చాయి. పథకం ప్రయోజనంపై అవగాహన కల్పించి, ఈ సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం. నియోజకవర్గానికి పది వేలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. 2026 మార్చికి పూర్తి చేయాలని నిర్దేశించింది. ఒక కిలో వాట్‌కి రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేలు సబ్సిడీ అందుతుంది. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

వేసవి నేపథ్యంలో విద్యుత్తు శాఖ తీసుకున్న యాక్షన్ ప్లాన్ ఏమిటి.?

వేసవిలో ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. అందులో భాగంగానే 11 కెవి, 33 కెవి, ఎల్‌టి లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ నిర్వహణ పనులను ప్రతి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు చేపడుతున్నాం. షెడ్యూల్ ప్రకారం నిరంతర ప్రక్రియగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నాం. వేసవిలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించబడుతున్నాయి. ఈ విషయం ప్రజలకు తెలియజేస్తే మా శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. పోలీసుల సహకారంతో నిఘా ఉంచుతున్నాం.

ఘనంగా శంబంగి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బొబ్బిలి

మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో కేక్ కట్ చేసి ఆయన ఆయన సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - గజపతినగరం

అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ఘనంగా ముగించామని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవి ప్రసాద్ తెలిపారు. వారోత్సవాలు సందర్భంగా గ్రామస్థాయి నుండి స్కూలు, కళాశాలలో, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ వంటి ప్రజా సంబంధిత ప్రాంతాలలో అగ్నిమాపక యంత్రాలతో అవగాహన కల్పించామన్నారు. ఆదివారం అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదిస్తే తక్షణమే స్పందిస్తామని తెలిపారు.

ఘనంగా స్నేహ పుష్పాంజలి

ప్రజాశక్తి- బొబ్బిలి

అంతర్జాతీయ సంస్థ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు దాదీ రతన్ మణి 12వ రోజు స్నేహ పుష్పాంజలి కార్యక్రమాన్ని ఆదివారం బొబ్బిలి బ్రాహ్మ కుమారీస్ ఆశ్రమంలో నిర్వహించారు. స్థానిక టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ హాజరై బొబ్బిలి ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అడ్మినిస్ట్రేటర్ బికె రాజేశ్వరి సమక్షంలో స్నేహ పుష్పాంజలి నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి బ్రహ్మకు మారిస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ దాదీజీ ఈ సంస్థకు అందించిన సేవలను కొనియాడారు.

ఆరికతోటలో ఆలయ పునః ప్రతిష్ట

రామభద్రపురం: ఆరికతోట గ్రామ మధ్య వీధిలో నెలకొన్న శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ట ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శిధిలావస్థలో ఉన్న ఆలయానికి భక్తుల విరాళాలతో, గ్రామస్తుల శ్రమదానంతో అందంగా నిర్మించి అమ్మవారి విగ్రహానికి రంగులు అద్ది భక్తి శ్రద్ధలతో వేదపండితుల మంత్ర అర్చనలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భారీ అన్న సమారాధన, ప్రసాద వితరణ చేశారు. గ్రామస్తులంతా ఏకస్తులై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ఆదిత్య వార్షికోత్సవం

నెల్లిమర్ల: స్థానిక శ్రీఆదిత్య విద్యాలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 24 వసంతాలు పూర్తి చేసుకొని 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న తరుణంలో ఈ వేడుకలను నిర్వహించారు. నగర పంచాయతీ చైర్పర్సన్ బంగారు సరోజిని, ఎంఇఒలు సూర్యనారాయణ మూర్తి, ఈపు విజయకుమార్ హాజరై మాట్లాడారు. నైతిక విలువ, ఉత్తమ విద్యను అందిస్తున్న ఏకైక ప్రైవేట్ సంస్థ అని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన రామాయణం నాటక అందర్నీ అబ్బురుపరిచింది. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ మెడల్స్ అంద జేశారు. ప్లే స్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వి.సూరిబాబు, హెచ్‌ఎం వి.అమృత పాల్గొన్నారు.

కెవిడి ఉద్యోగుల ఆర్థిక సాయం

నెల్లిమర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు కెవిడి ఎంప్లాయిస్, 2007 ఎస్ఎస్‌సి బ్యాచ్ ఆర్థిక సహాయం అందజేసింది. ఆదివారం కొండవెలగాడ గ్రామంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద దంతినాడ చిన్నమ్మలుకు కెవిడి ఎంప్లాయిస్ గ్రూప్ రూ.16వేలు ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నమ్ములుకు గర్భాశయం ఆపరేషన్ జరిగి ఇన్ఫెక్షన్ ఎక్కువ కావటంతో ఆరోగ్యం దెబ్బతిని భోజనం కూడా చెయ్యలేని పరిస్థితిలో ఆర్థిక పరిస్థితి తెలుసుకొని కెవిడి ఎంప్లాయిస్ గ్రూప్ ఈ ఆర్థిక సహాయం చేశారు. ఇదే గ్రామానికి చెందిన 2007 ఎస్ఎస్‌సి బ్యాచ్ విద్యార్థుల మరో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఉరేసుకుని విమానాశ్రయ కూలీ మృతి

భోగాపురం : విమానాశ్రయ పనులకు వచ్చి విద్యుత్ స్తంభానికి ఉరివేసుకొని జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని పోలిపల్లి సమీపంలో హైవేకు ఆనుకుని ఉన్న లేఔట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సురేష్ భూయాన్ (47) విమానాశ్రయ నిర్మాణ పనుల కోసం వచ్చాడు. ఏమైందో తెలియదు గానీ పోలిపల్లి లేఔట్ లోపల శనివారం రాత్రి విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్నాడు. ఉదయాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విమానాశ్రయ కూలీగా పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

గంట్యాడ : మండలంలోని మదనాపురం గ్రామంలో ఆదివారం కంకరు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ వర్రీ రామారావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. కంకరు లోడుతో మదనాపురం జంక్షన్ నుండి మదనాపురం గ్రామంలోనికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులోనికి బోల్తా పడడంతో ఇంజన్ కింద పడి డ్రైవర్ రామారావు మృతి చెందారు. రామారావుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న టి.వి.వి. మహేశ్వరరావు (47) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం ఎల్‌కోటలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన అకాల మరణానికి ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణతో పాటు సిబ్బంది ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మా బాధలు పట్టవా?

- వేతనాలు అందక ఉపాధి కూలీల గగ్గోలు
- గునపాలు, తట్టలు, వేసవి అలవెన్స్ కూడా అందని వైనం
- పనిచేసే చోట సౌకర్యాలూ అంతంత మాత్రమే

వలసలు నివారించాలనే ఉద్దేశ్యంతో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి, కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పనిచేసినా మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు ఆకలితో గగ్గోలు పెడుతున్నారు. దీంతో చాలా మంది ఇక్కడ కూడా సకాలంలో వేతనాలు అందడంలేదన్న ఉద్దేశ్యంతో మళ్లీ వలస బాట పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వం లక్ష్యం పక్కదారి పడుతుంది. వేతనాలు మాట అటుంచితే కనీసం గుణపాలు, తట్టలు, వేసవి అలెవెన్స్ కూడా కూలీలకు ఇవ్వడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. గతంలో ఎన్నడూ ఈ విధంగా లేదని ఇన్ని నెలలు వేతనాలు అందని పరిస్థితి తామెప్పుడూ చూడలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని 29 పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో సుమారు 6,800 మంది పనిచేస్తున్నారు. వీరికి గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి అష్ట కష్టాలు పడుతున్నారు. ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పించి 15 రోజులకు ఒకసారి వేతనాలు అందజేయాలని ఉపాధి హామీ పథకం చట్టంలో ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావస్తున్నా 2024-2025లో పని చేసిన 6 వారాలకు, 2025-2026 సంవత్సరానికి సంబంధించిన వేతనాలు నేటి వరకు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం తలకు మించిన భారంగా మారిందని వేతనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బాధలు తమకు ఎప్పుడు తీరుతాయో అంటూ గత్యంతరం లేక ఈ పని చేయవలసి వస్తుందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

11 వారాలుగా అందని వేతనాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత 11 వారాలుగా పనిచేసి కాలానికి వేతనాలు ఇవ్వలేదు. ఎండల్లో పనిచేసే తమకు 15 రోజులకు ఒకసారి వేతనాలు అందజేయకపోతే ఎలా అని కూలీలు ప్రశ్నిస్తున్నారు. మండుతున్న ఎండలో పనిచేసి కుటుంబం పస్తులతో బాధలు పడడమే తప్ప వేతనాలు అందే పరిస్థితి కనిపించడం లేదని చెబుతున్నారు.

గతంలో ఈ పరిస్థితి లేదు

గత ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదు. పనిచేసిన 15 రోజులకే నా ఖాతాలో డబ్బులు పడిపోయేవి. ఇప్పుడు సుమారు మూడు నెలలు కావస్తున్నా కూలి డబ్బులు ఇంకా నా ఖాతాలో పడలేదు. ఇలా అయితే కుటుంబ పోషణ ఎలా సాధ్యమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేను పనిచేసిన రోజులకు వేతనం అందిస్తారని ఆశిస్తున్నాను.

కూనిరెడ్డి రామయ్యమ్మ, గుడివాడ

ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు

కష్టపడి పని చేసి పస్తులు ఉండవలసి వస్తుంది

ప్రభుత్వం చేసిన పనులకు వేతనాలు సకాలంలో అందకపోవడంతో వేరే ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల మా కుటుంబాన్ని పోషించు కోవడం చాలా ఇబ్బందిగా మారింది. ఈ ప్రభుత్వం మాటలే తప్ప చేతల్లో కనిపించలేదు. ఇప్పటికైనా చేసిన పనికి వేతనం చెల్లించి పడుతున్న ఇబ్బందులను తొలగించాలని సంబంధిత అధికారులను కోరుతున్నాను.

ఎం వరలక్ష్మి, వల్లంపూడి గ్రామం

వాస్తవాలను అంగీకరించే ధైర్యం లేకే ఎదురు దాడి

మాజీ ఎమ్‌పి బెల్లాన

ప్రజాశక్తి - చీపురుపల్లి

వాస్తవాలను అంగీకరించే ధైర్యం లేకనే తమ నాయకులపై టిడిపి నాయకులు ఎదురు దాడికి దిగుతున్నారని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. తిరుపతిలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు. కళ్ల ముందే ఆధారాలున్నా చంద్రబాబునాయుడు, లోకేస్‌లు వాస్తవాలను కప్పి పుచ్చుకునేందుకు వైసిపి నాయకులపై ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు. గోవులు మృతి చెందాయని టిటిడి ఛైర్మన్, ఆలయ ఇఒ, తిరుపతి ఎమ్మెల్యేలు అంగీకరించారన్నారు. గడిచిన 11 నెలలుగా తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డిని తిట్టడమే పనిగా పెట్టుకొని ప్రజా సమస్యలను కూటమి నాయకులు గాలికొదిలేసారని అన్నారు. గోవుల మృతిపై చర్చకు పిలిచినట్లు పిలిచి తమ నాయకులు భూమన కరుణాకరరెడ్డిని అరెస్ట్ చేయడంలోనే కూటమి నేతల గొప్పతనమేమిటో ప్రజలకు అర్థమైందన్నారు. ఈ సంఘటనపై పవన్‌కళ్యాన్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గోవుల మరణాల పట్ల ఒక కమిటీని వేసి నిజా నిజాలను నిగ్గు తేల్చాలని బెల్లాన చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఈస్టర్ వేడుకలను పురష్కరించుకుని మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఆరికతోట ఏడిఎం బాప్టిస్ట్ చర్చి ఫాదర్ సురేష్ కుమార్, సంఘ పెద్దలు,ప్రెసిడెంట్ చంద్రశేఖర్,సెక్రటరీ జార్జ్ ఎబినైజర్, ట్రెజరర్ ఆదాయాల ఆధ్వర్యంలో బైబిల్ పటించి యేసు కీర్తనలు ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ జార్జ్ ఎబినైజర్ మాట్లాడుతూ ఈ దినం అతి పవిత్ర దినంగా భావిస్తామని 40 రోజులు శ్రమ దినాలు పాటించి ఉపవాస దీక్షలు చేసి గుడ్ ఫ్రైడే రోజున దీక్షలు విరమించి ఈస్టర్ రోజున పరమపదించిన పెద్దల సమాధులను వివిధ రకాల పూలతో అలంకరించి, కొవ్వొత్తుల వెలుగులో ప్రార్థనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంకి పుష్పమ్మ, మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య సంఘ కాపరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో ఈస్టర్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌సిఎం, సిబిఎం, సెవెంత్ డే, లూథరన్ చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఫాస్టర్లకు కానుకలు ఇచ్చి ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. యేసు మరణించిన రోజు గుడ్ ఫ్రై డే నిర్వహించి మూడు రోజుల తర్వాత యేసు సజీవంగా లేచిన రోజును ఈస్టర్ వేడుకలు జరుపుకోవడం అనవాయితీ అని జెసి రాజు అన్నారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కొత్తవలస: కొత్తవలస పాస్టర్స్ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈస్టర్ ర్యాలీ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తవలస రైల్వే స్టేషన్ నుండి హైస్కూల్ గ్రౌండ్ వరకు ర్యాలీ చేసి వేడుకలను నిర్వహించారు. అన్ని క్రైస్తవ సంఘాల సేవకులు, విశ్వాసులు ఎంతో ఉత్సాహంతో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రెసిడెంట్ రెవ.ఎం. జాన్‌కుమార్, సెక్రటరీ రెవ. ఎస్.చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

'సాధన' సభ్యుడి జ్ఞాపకార్థం రక్తదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో సాధన యువజన సంఘం సభ్యుడి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. జరజాపుపేట సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో సాధన యువజన సంఘం ఉపాధ్యక్షులు కీర్తిశేషులు నల్లి ఉమాశంకర్ జ్ఞాపకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా ఉమా శంకర్ కుటుంబానికి తన వంతుగా ఒక లక్ష రూపాయిలు ఆర్థిక సహకారం అందజేసి కుటుంబానికి భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పెనుమత్స అప్పలరాజు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ రావు, మిత్ర బృంద సభ్యులు బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తుమ్ము అశోక్, శీల చిరంజీవి, పోలుబోతు భాస్కర్, గిన్ని మోహన్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

బాధిత కుటుంబ సభ్యులకు బీమా పత్రాలను అందిస్తున్న మంత్రి శ్రీనివాస్

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- బొండపల్లి

టిడిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బొండపల్లి పంచాయతీ పరిధిలోని చందకపేట గ్రామంలో టిడిపి కార్యకర్త వెలుగుల లావన్ కుమార్ జనవరి 14న రోడ్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంత్రి శ్రీనివాస్ మరణించిన లవన్ కుమార్ భార్య చైతన్య లక్ష్మికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. అనతరం లవన్‌కుమార్ తండ్రి గోపి, మామయ్యా అమలకంటి అప్పారావులను పరామర్శించారు. తొలుత లవన్ కుమార్ చిత్ర పటానికి మంత్రి శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సూచన మేరకు ప్రమాదం జరిగినా, మరణించిన కార్యకర్తల కుటుంబాలను కలుసుకొని వారి కష్టాలలో భాగస్వామ్యం కావాలన్నదే తమ అభిమతమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్, నాయకులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి చిరంజీవి రాజు, జంపన సూర్యనారాయణ రాజు, పట్నాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్య' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేసినట్లు లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు వెంపడాపు ఈశ్వరరావు, చీమలపాటి శర్మ, అజ్జాడ నరేష్, రహీం షేక్ లాల్ తెలిపారు. స్థానిక చైతన్య జూనియర్ కాలేజీలో జరిగిన ఈ పోటీలకు కర్రి పవిత్ర లహరి ఆర్థిక సహాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండ సత్యసాయితి, ఏడువాక గాయత్రి, జామి వెంకట రమణ, ఏడువాక భాస్కరరావు, చింత అప్పారావు, ఇర్రా హేమంత్ మాట్లాడుతూ ఎస్‌కోట, యల్ కోట, వేపాడ, కొత్తవలస, జామి, గంట్యాడ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. 110 మంది విద్యార్థులను 22 గ్రూపులుగా విభజించి వివిధ రౌండులుగా క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నరేష్, శర్మ, వేణు, కిరణ్, సత్యారావు, రవి, గూనూరు వెంకటరావు, భాస్కరరావు, బండారు మోహన్, రహీం షేక్ లాల్ ఆధ్వర్యంలో క్విజ్ నిర్వహించి ఎస్‌కోట డిటి పి.సునీత, రైల్వే జెఇ వేచలపు ఎర్నికృష్ణ చేతులు మీదుగా విజేతలకు నగదు బహుమతులను అందించామన్నారు. ప్రథమ బహుమతిగా కుమరాం విద్యార్థులకు రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా పెదవేమలి విద్యార్థులకు రూ.4500, తృతీయ బహుమతిగా ఎంజెబి పాఠశాల రంగాపురం విద్యార్థులకు రూ.3వేలు అందించామన్నారు.

పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి- బాడంగి

తమ గ్రామంలో ఉన్న పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని ఎరుకలపాకలు గ్రామస్తులు కోరుతున్నారు. పూర్తిగా ట్రైబల్ పాఠశాలగా పిలవబడే పాఠశాలలో సుమారు 19 మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరినీ పక్కనే ఉన్న గజరాయనివలస పాఠశాలకు తరలించడంతో హైవే రోడ్డును దాటుకుని వెళ్ళవలసి వస్తుందని చెప్పారు. వెళ్లేదారిలో ఇదివరకే చాలా ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. అందుకే తమ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులే ఉన్నారని, వారికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తు చేశారు. గ్రామస్తులు, పంచాయతీ, విద్యాశాఖ తీర్మానంతో ఒకటి రెండు తరగతులను లక్ష్మీపురంలో, ఒకటి నుండి ఐదు తరగతులు ఎరుకులపాకల గ్రామంలో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

జనసేన బలోపేతమవ్వాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జనసేన పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవ్వాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లాయి వలసలో జనసేన క్రియాశీల కిట్లును జనసేన వాలంటీర్లకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జనసేన నాయకులు వందనాల అప్పలరాజు సొంత నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా చేస్తున్న ట్యాంక్‌లను ఆమె ప్రారంభించారు. పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పతివాడ శ్రీను, రౌతు శ్రీరామూర్తి, పిన్నింటి కుమార్, దేశెట్టి గణేష్, నక్కాన రమణ, గుడివాడ జమరాజు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఘనంగా సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

బొబ్బిలి: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

సిఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజును పురష్కరించుకుని పట్టణంలో ఎమ్మెల్యే మహా అన్నదానం చేశారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ సంస్థలో ఉన్న అనాథ పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పోషకాహారం పంపిణీ చేశారు.

మెంటాడ: టిడిపి మండల అధ్యక్షుడు చలమూరి వెంకటరావు అధ్యక్షతన స్థానిక కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, పంపిణీ చేశారు.

సంతకవిటి: బిల్లాని గ్రామంలో ఎమ్మెల్యే కోండ్రు మురళి కేక్ కట్ చేసి, సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిల్లాని, తలతంపర రహదారులకు శంకుస్థాపన చేశారు.

బాడంగి: స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు ఆధ్వర్యంలో సిఎం పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలవలస గౌరు, నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం: వికలాంగుల మారుతి సంఘం ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు చిన్నారావు, నందిగం పంచాయతీ టిడిపి నాయకులు నంద ముకుందరావు ఆధ్వర్యంలో పేద ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపార్టీ నాయకులు లోకేష్, బొడ్డ రమణ, బట్ట వెంకట్ పాల్గొన్నారు.

రావాడలో 75 కేజీలు కేక్ ని కట్ చేసిన నాయకులు

మండలంలోని రావాడ గ్రామంలో 75 కేజీల కేకును రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ కట్ చేశారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రాముని సన్నిధిలో 101 కొబ్బరికాయలు కొట్టి కేక్ కట్ చేశారు. టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న పాల్గొన్నారు.

డెంకాడ: పిల్లలకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే, చంద్రశేఖర్

వేపాడ: మండల కేంద్రంలో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కేకు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, దాసరి లక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: పూసపాటిరేగ సంతోషిమాత ఆలయంలో ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రెల్లివలసలో సర్పంచ్ ఇజ్జురౌతు అప్పల రాజు ఆధ్వ ర్యంలో చంద్రబాబు చిత్ర పటానికి ఎమ్మెల్యే నాగ మాధవి సమక్షంలో పాలాభిషేకం చేశారు.

టిడిపిలో రెండు గ్రూపులు?

డెంకాడ: మండలంలోని టిడిపి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీన్ని బలపరుస్తూ టిడిపి నాయకులు ఆదివారం రెండు గ్రూపులుగా విడిపోయి సిఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకులను వేరు వేరుగా చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద తాడివాడ గ్రామంలో ఉన్న హాస్టల్ విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కేకు కట్ చేసి విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాణిరాజు, మరికొందరు మండలంలో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు పాల్గొన్నారు. కాగా మరోచోట చింతలవలస వెంకటేశ్వరస్వామి కోవెలలో సిఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పూజలు నిర్వహించి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, పతివాడ తమ్మినాయుడు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, నియోజకవర్గ టిడిపి నాయకులు, మండలంలో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో మరోసారి టిడిపిలో గ్రూపు రాజకీయాలపై చర్చ జరుగుతోంది.



భోగాపురం: 75 కిలోల కేకును కట్ చేస్తున్న టిడిపి నాయకులు

చీపురుపల్లి: ఎమ్మెల్యే కళావెంకటరావు క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కేక్ కట్ చేశారు. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో రామ్‌మల్లిక్ నాయుడు పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో నాలుగు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని బలిఘట్టం గ్రామంలో న్యూహోప్ రూరల్ లెప్రసీ ట్రస్ట్‌లో, చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లో గల దుర్గా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వెంకటేశ్వర హాస్పిటల్‌లో గల రోగులకు పళ్ల బ్రేడ్స్ అందించారు.

శృంగవరపు కోట: ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పలరాంప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని దేవితల్లి ఆలలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. పట్టణంలోని 500మంది నిరుపేదలకు చీరలు, పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపిటిసి గనివాడ లక్ష్మి భర్తను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

పట్టణంలోని గొంప కృష్ణ టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.



చీపురుపల్లి: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

ఎస్.కోట: చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ: కేకును పంచి పెడుతున్న గొంప వెంకటరావు